కథ

# త్రుప్తి

'విశారద'



''ఏమిటండీ ఈ బియ్యంలో గాజు ముక్కలు? తిని బతకడానికేనా?''

శ్రీమతి విసురుగా చేటలో బియ్యంతోసహా నా దగ్గ రికి వచ్చింది. చేటలోకి తొంగి చూద్దునుగదా, చిన్న చిన్న ముక్కలుగా చేసి మరీ కలిపిన గాజుముక్కలు. నవ్వొచ్చింది.

కల్తీల్లో మన దేశం ఎంతగా పురోగమనం సాధిస్తుందో అర్థమైంది. కల్తీ కళలో ఇండియాదే అగ్రస్థానం కావచ్చు.

''ఏమిటండీ మాటా పలుకూ లేకుండా కూర్చున్నారు? వెళ్లి ఈ బియ్యం ఆ షాపువాడి ముఖాన కొట్టి రండి'' మండి పడింది శ్రీమతి.

''చూడమ్మాయ్! ఇవి తీసుకెళ్లి నువ్వు చెప్పినట్టే వాడి ముఖాన కొట్టాననుకో. అందువల్ల నష్టం మనకే. గాజు ముక్కలు కాదు, ఈసారి విజృంభించి సీసా పెంకులే కలుపుతాం, ఎవడితో చెప్పుకుంటావో చెప్పుకో ఫో అంటాడు. ఇష్టముంటే తీసుకో. లేకపోతే లేదు అంటాడు. మరి మనకా రేషన్ బియ్యమే గతి కదా?''

''ఏడ్చినట్టుంది. అసలు అందరూ మీలా ఊరుకుంటున్నారు కాబట్టే ఆ రేషన్ వాళ్ళు మట్టిగడ్డల్లోంచి గులకరాళ్లల్లోకి, గులక రాళ్లల్లోంచి బొగ్గుముక్కల్లోకి, బొగ్గుముక్కల్లోంచి గాజుపెంకులదాకా ఎదిగారు. కంప్లైంట్ చెయ్యకపోతే ఎలా?'' పద్మ ఆవేశంగా అంది.

మా ఆవిడ అమాయకత్వానికి నవ్వొచ్చింది.

''చూడండి శ్రీమతిగారూ! ఎవరికి కంప్లైంట్ చెయ్యమంటావు? సామాన్య ప్రజానీకం గురించి పట్టించుకునే నాధుడేడీ? మన నాయకులంతా పార్టీ ఫిరాయింపుల్లోనూ, పదవుల కోసం పాకులాడ్డంలోనూ, కుంభకోణాలు సృష్టించడంలోనూ బిజీగా వుంటారాయే. ఇక ఎంత గొంతు చించుకుని అరిచినా మన పేద గొంతులు ఎవరికీ వినిపించవు. అరిస్తే మనకే గొంతు నొప్పి. అంచేత నోర్మూసుకుని కూర్చోవడం బెస్టు'' నవ్వాను.

''నవ్వకండి. నాకొళ్లు మండుతోంది. ఈ గాజు ముక్కలు పొరపాటున కడుపులోకి పోతే ఇంకేమైనా వుందా అని'' అంది పద్మ భయపడుతూ.

''చూడు డియర్! ముందు ముందు రేషన్‌వాళ్ళు మనకి బియ్యం కూడా ఇవ్వరు. అప్పుడు మనకి బొగ్గు ముక్కలు, గాజుపెంకులే గతి. ఒక్కసారిగా వాటిని తినడం కష్టం కాబట్టి ఇప్పటినుండే కొంచెం కొంచెంగా వాటిని అలవాటు చేసుకుంటే బాగుంటుందని పాపం రేషన్ వాళ్ళు సహృదయంతో చేస్తున్న...''

నా మాటలకి మధ్యలోనే అడ్డొచ్చింది పద్మ.

''చాల్లెండి మీ జోకులు తర్వాత వింటానుగానీ ముందు ఈ బియ్యం నుండి గాజుముక్కల్నెలా వేరు చేయాలో అర్థం కాక ఛస్తున్నా...'' పద్మ చేటలోని బియ్యం వైపు అయోమయంగా చూస్తూ అంది.

''ఇందులో అర్థం కాకపోవడానికేముంది పద్మా! నేనూ నా చాతనైనంత సహాయం చేస్తాను గాజుముక్కల్ని ఏరడంలో. అయినా ఈవేళ మాకు సెలవెందుకు ఇచ్చారనుకుంటున్నావు? పండుగనా? కాదు డియర్...బియ్యంలో గాజు పెంకుల్ని, కందిపప్పులో కంకర రాళ్ళనీ, చింతపండులో మట్టిసుద్దల్ని, రవ్వలో ఇసుకనీ, జీలకర్రలో పుల్లల్ని, వీటన్నింటితో నిండివున్న పురుగుల్ని ఏరడంలో భార్యామణులకి సహాయం చెయ్యమని ఇచ్చారు తెలిసిందా?''

''ఆ...ఆ...తెలుస్తూనే వుందిలెండి. ఈ గాజుపెంకుల్ని ఎలాగో తంటాలుపడి నేనేరుకుంటానుగానీ ముందు బజారుకెళ్లి కాస్త చింతపండు, సెనగపప్పు...''

''హమ్మో...''

''అదేమిటండీ భూకంపం వచ్చినట్లు అలా అరిచారు?'' హడలిపోతూ అడిగింది పద్మ.

''లేకపోతే ఏమిటి పద్మా! నువ్వు మరీ అలాటి కోరికలు కోరుతుంటేనూ...''

''ఏమిటా కోరికలు?'' పద్మ ఆశ్చర్యంగా చూసింది.

''అదే చింతపండు, సెనగపప్పు వగైరాలు కావాలని కోరడం. చింతపండు లేనందుకు చింతవలదు. సెనగపప్పు లేనందుకు సంతాపం వలదు. కందిపప్పు లేదని కలవరం వలదు, బెల్లం లేదని బాధ ఏల? ఆవాలు లేవని ఆవేదన ఏల...ఓ బేలా?''

''మీ కవిత్వానికి సంతోషించాంగానీ ఏవండీ ఈవేళ పండగండీ. కనీసం రవ్వకేసరి అయినా...'' నసిగింది పద్మ.

''చూడు పద్మా! రవ్వకేసరి కన్నా రవ్వల నెక్లెస్ చౌకని, పులిహోరకన్నా పులిగోరు గొలుసు చీప్ అని నా అనుమానం. చింతపండు, కందిపప్పు లాంటి గొంతెమ్మ కోరికలు మనం కోరుకోకూడదోయ్! పద్మా డార్లింగ్...ఎంచక్కా మనమిలా కూర్చుని కబుర్లు చెప్పుకుందాం. నీ మాటలే నాకు రసగుల్లాలు. నా కబుర్లే నీకు గులాబ్‌జామ్‌లు. సరేనా. ఆ చేట ఇలా తీసుకురా. మట్టిగడ్డలు...ఓ అయామ్ సారీ. మట్టిగడ్డల కాలం ఎప్పుడో పోయిందికదూ. గాజుపెంకులేరుకుందాం రా...'' అని కొన్ని క్షణాల తర్వాత-

''మనకు కొన్నాళ్ళు పోయాక ఈ బియ్యం పప్పులు, ఉప్పులు గట్రాల రేట్లు మనం అందుకోలేనంత ఎత్తులో వుంటాయి. అప్పుడు ప్రభుత్వం వారు మన మధ్య తరగతి కుటుంబాల మీద దయ దలచి కంకర్రాళ్ళు, ఇటుకలు, సీసా పెంకులు, జనపనార...లాంటివి మనకు రేషన్ కార్డులద్వారా ఇస్తారన్నమాట!''

ఫక్కున నవ్వింది పద్మ.

అన్యోన్యత, అనుబంధం, సంతోషం, సంతృప్తిలాంటివి, రేషన్‌కార్డుమీద కాదుకదా. బ్లాకులో డబ్బు కుమ్మరించి కొనుక్కుందామన్నా ఎక్కడా దొరికేవి కావుకదా! కుటుంబంలో ప్రశాంతత, కుటుంబ సభ్యుల మధ్య ప్రగాఢ అనుబంధం ఉన్నప్పుడు గాజుపెంకులు, జనపనారలు తినాల్సి వస్తే మాత్రమేమి? ఆలోచిస్తూ పద్మ వైపు చూశాను.

తను ఇంకా నవ్వుతూనే వుంది

ప్రశాంతమైన ఆ నవ్వులో దసరా పండుగ సందళ్ళు, సంబరాలు అన్నీ కనిపించాయి. అలా చూస్తూ వుండిపోయాను.

★